కేంద్రీయ విద్యాలయలో వర్క్‌షాప్



మట్టితో గణపతి ప్రతిమలను తయారు చేసిన విద్యార్థులు

రాయదుర్గం: గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో మట్టి గణేశుల తయారీపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం 'పర్యావరణ అవగాహన'పై వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. విద్యార్థులు మట్టితో గణపతి ప్రతిమలు, దీపాలు, ఎలుకలను తయారు చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న నియోజకవర్గ కన్వీనర్ రాఘవేందర్‌రావు

చందానగర్: హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీస్, కాలనీలలో గురువారం ఆర్‌కెవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కన్వీనర్ రాఘవేందర్‌రావు మాట్లాడుతూ మట్టి గణపతిని పూజించి, పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. ఆదిత్య హోమ్, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్, ఎస్ఎంఆర్ హిల్ హాండ్స్, లక్ష్మీ ఐశ్వర్య ఎస్టేట్స్, ప్రజయ్ మెగా పోలీస్, మాతృశ్రీనగర్, మై హోమ్ అపార్ట్‌మెంట్, దీప్తిశ్రీనగర్ తదితర కాలనీలలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : చందానగర్ డివిజన్ కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్ కాలనీలో శేరిలింగంపల్లి సర్వీ సమాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం దుర్గామాత ఆలయంలో ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, గౌతమ్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, సందీప్‌రెడ్డి, సర్వీ సమాజ్ ట్రస్ట్ అధ్యక్షులు మనోజ్ చౌదరి, మంగిలాల్ పరహరియా చౌదరి, వినోద్ చౌదరి, దేవరంజీ, బిక్రమ్ జి, కంగర్ సోయాల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న కొండ విజయ్‌కుమార్

చందానగర్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి లయన్స్ క్లబ్ ఆర్థికసాయం చేసింది. గురువారం చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో శంకర్‌నగర్‌కు చెందిన నారాయణ చికిత్స నిమిత్తం ఆయన కుమార్తె కోకిలకు రూ.20వేలు క్లబ్ జోన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు బసిరెడ్డి మధుసూధన్‌రెడ్డి, ట్రెజరర్ రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సభ్యులు దాసరి రాజశేఖర్, పిన్నమొల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసిన లైట్‌హౌజ్ ప్రతినిధులు



జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసిన ప్రతినిధులు

చందానగర్: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని చందానగర్‌లోని లైట్‌హౌస్ ప్రోగ్రాం మేనేజర్ ఆకుల శ్రీనివాస్, ప్రోగ్రామ్ సీఈఓ అమృతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరంలో మరిన్ని లైట్‌హౌస్‌ల విస్తరణపై చర్చించినట్టు మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. లైట్‌హౌస్‌లో యువతకు ఇస్తున్న శిక్షణ తరగతుల గురించి కమిషనర్‌కు వివరించామన్నారు.

మొదటి బోధన, అభ్యాసం మాతృభాషలోనే జరగాలి

హెచ్‌సీయూ ప్రొ.పంచానన్ మొహంతి

రాయదుర్గం: జ్ఞానాన్ని ఒక తరం నుంచి మరో తరానికి అందించడానికి భాష అవసరమని హెచ్‌సీయూ ప్రొఫెసర్ పంచానన్ మొహంతి పేర్కొన్నారు.ఎన్ఈపీ-2020 ప్రకారం మొదటి బోధన, అభ్యాసం మాతృభాషలోనే జరగాలని అభిప్రాయపడ్డారు.గురువారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా 3 ×డబ్ల్యూ'స్ ఆఫ్ ఎడ్యుకేషన్-వాట్, హౌవ్, అండ్ వై.. అనే అంశంపై ఆయన మాట్లాడుతూ పిల్లల మానసిక వికాసాన్ని పెంపొందించడంలో మాతృభాష యొక్క ప్రాముఖ్యతను వివరించారు. తగిన బోధనా పద్ధతులతో పాటు దానిని సంరక్షించడం, ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. వీసీ ఐనుల్ హసన్ మాట్లాడుతూ బోధన, అభ్యాసం రెండింటిలోనూ శ్రేష్ఠతకు కట్టుబడి ఉండాలని విద్యావేత్తలను కోరారు. అనంతరం రేవంతి తంగవేలును ఘనంగా సత్కరించారు.

ఆ సార్లే మాకు కావాలి..

- గౌలిదొడ్డిలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థుల ధర్నా
- ప్రైవేటు టీచింగ్ ఫ్యాకల్టీని తొలగించి.. ఏడుగురు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించిన అధికారులు

రాయదుర్గం/హఫీజ్‌పేట్: ఆ సార్లే కావాలి.. వారు చెప్పే పాఠాలు బాగా అర్థం అవుతున్నాయి.. వారిని పంపించొద్దు అంటూ ఉపాధ్యాయ దినోత్సవం రోజు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల బాలురు, బాలికలు వేర్వేరుగా ధర్నా చేశారు. ఐఐటీ, నీట్ సిలబస్ బోధించడానికి ఇప్పటి వరకు కొనసాగిన పాత ఫ్యాకల్టీనే ఉంచాలని డిమాండ్ చేశారు. గురువారం గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర నీట్, ఐఐటీ కోచింగ్ సెంటర్ కళాశాల, బాలికల కళాశాల ప్రధాన గేటు ముందు విద్యార్థులు ఆందోళన చేశారు. తాత్కాలిక పద్ధతిన నియామకమైన అధ్యాపకులే కావాలని నినాదాలు చేశారు. ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ గణేష్, శారద నచ్చజెప్పినా వారు ఒప్పుకోలేదు. సాంఘిక సంక్షేమ గురుకులాల



గౌలిదొడ్డి సంక్షేమ గురుకుల బాలికల కళాశాల వద్ద విద్యార్థినుల ధర్నా



గౌలిదొడ్డి సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ముందు విద్యార్థుల ధర్నా

జాయింట్ సెక్రటరీ వచ్చి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా ఈ కళాశాలల్లో 20 మంది ప్రైవేట్ టీచింగ్ ఫ్యాకల్టీతో నీట్, ఐఐటీ కోచింగ్‌కు ఏర్పాట్లు చేశారు. కానీ ఉన్నతాధికారులు ఈ విద్యాసంవత్సరం 20 మందిని తొలగించారు. వారి స్థానంలో కొత్తగా శాశ్వత ప్రాతిపదికన ఏడు మందిని నియమించారు. దీంతో రెండు రోజులుగా తాత్కాలిక అధ్యాపకులు రాక పోవడంతో విద్యార్థులు ఆందోళన చేయడంతో సంక్షేమ గురుకులాల జాయింట్ సెక్రటరీ సక్రూనాయక్ అక్కడకు చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు.

సోమవారం నిర్ణయం తీసుకుంటాం..

విద్యార్థులకు న్యాయం చేస్తామని, ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం అని సాంఘిక సంక్షేమ గురుకులాల జాయింట్ సెక్రటరీ సక్రూనాయక్ అన్నారు. ఈ విషయంపై సోమవారం నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన ప్రిన్సిపాల్స్ గణేష్, శారదలను కలిసి మాట్లాడారు.

పాత ఫ్యాకల్టీని కొనసాగించాలి



గురుకులాలల్లో పాత ఫ్యాకల్టీని కొనసాగించాలి. అకడమిక్ ఇయర్ మధ్యలో కొత్తవారిని నియమిస్తే ఇబ్బందులు వస్తాయి. సిలబస్, నీట్, ఐఐటీ పాఠాలు అర్థం కావు. మాకు న్యాయం చేయాలి

-రక్షిత్, విద్యార్థి

అనుభవం ఉన్నవారే కావాలి



ఇప్పటివరకు కోచింగ్ ఇచ్చిన అధ్యాపకులు అయితేనే మాకు న్యాయం జరుగుతుంది. విద్యాసంవత్సరం మధ్యలో పాత వారిని తొలగించడమేమిటి....? అనుభవం లేని కొత్తవారిని నియమించారు. దీంతో సమస్యలు వస్తాయి.

-హర్షవర్ధన్, విద్యార్థి

3 నెలల్లో మెయిన్స్..



పాత ఫ్యాకల్టీ తొలగింపు ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గత ఏడాది రెగ్యులర్‌లతో పాటు నీట్, ఐఐటీలో మంచి ఫలితాలు వచ్చాయి.మూడు నెలల్లో మెయిన్స్ పరీక్షలు ఉన్నాయి. కొత్తవారు ఎలా బోధిస్తారు...? దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలి

-బలరామ్, విద్యార్థి

వరద నీటి కాల్వ పనుల్లో వేగం పెంచాలి

ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి రోడ్డులో ఇండియన్ బ్యాంకు నుంచి ఎల్లమ్మ చెరువు అలుగు వరకు 2 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో జరుగుతున్న వరద నీటి కాల్వ పనులను గురువారం ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత పాటించాలన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలు, నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి పనులు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ అధికారులు ఈఈ గోవర్ధన్‌గౌడ్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, కాంగ్రెస్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, జిల్లా గణేష్, కాశీనాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న వరద నీటి కాల్వ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ప్రభుత్వ భూములను కాపాడాలి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ వెంకారెడ్డిని గురువారం జనం కోసం ప్రతినిధి బృందం కలిసి ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, సభ్యురాలు మేరీ సాల్మన్ తహసీల్దార్‌ను కలిసి కబ్జాల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.ప్రభుత్వ భూములను పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.



శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న భాస్కర్‌రెడ్డి

కాలనీ అభివృద్ధికి సహకారమందిస్తాం



ఎమ్మెల్యే గాంధీని కలిసిన శివాజీనగర్ కాలనీ నూతన అసోసియేషన్ సభ్యులు

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని శివాజీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీనగర్ అసోసియేషన్ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కాలనీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అసంపూర్తి పనులను త్వరలోనే పూర్తి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ చందానగర్ డివిజన్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, శివాజీనగర్ కాలనీ అధ్యక్షులు దీక్షిత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చందపేట రమేష్, ట్రెజరర్ శివ ప్రసాద్, అడ్వైజర్ కమిటీ సభ్యులు అఖిల్ సక్సేన, ఫహీం, సుబ్రమణ్యం రాజు, కల్యాణ్, సాయి వెంకట్, సీనియర్ కమిటీ సభ్యులు ఎస్ఎన్ రెడ్డి, నర్సింలు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

శేరిలింగంపల్లి: రంగారెడ్డి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన స్కూల్ అసిస్టెంట్స్ సూర్యప్రభ (బయో సైన్స్), బి.ఉదయకుమారి (ఫిజికల్ సైన్స్) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.వారిని రంగారెడ్డి జిల్లా పరిషత్ హాల్‌లో కలెక్టర్ శశాంక ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, మెమెంటోతో సత్కరించారు.



స్కూల్ అసిస్టెంట్ సూర్యప్రభ



స్కూల్ అసిస్టెంట్ బి.ఉదయకుమారి

'సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 'స్పిరిచ్యువల్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ గణేష్ చతుర్థి-హౌ టు లీడ్ యాన్ అబ్‌స్టాకిల్ ఫ్రీ లైఫ్' అనే అంశంపై సీనియర్ రాజయోగ టీచర్, బ్రహ్మకుమారీస్ సంస్థ బ్రాంచ్ కో ఆర్డినేటర్ బికె అరుంధతి ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

నేడు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గాంధీ థీమ్ పార్క్ వద్ద శుక్రవారం ఉదయం 8 గంటలకు మట్టి వినాయకు ప్రతిమల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మహి పాల్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

బస్తీ దవాఖానా ఆకస్మిక తనిఖీ

కేపీహెచ్‌బీ కాలనీ: కేపీహెచ్‌బీ 3వ ఫేజులోని బస్తీ దవాఖానాను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలో సరైన వైద్య సదుపాయాలు లేక గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని ,సౌకర్యాలు కల్పించాలని వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగేలా చూడాలి

జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: వినాయక ఉత్సవాలు, నిమజ్జనం ఏర్పాట్లను వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నవరాత్రోత్సవాలపై ఆయన గురువారం సమీక్షించారు. ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగేలా ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకొని ముందుకుసాగాలన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మంచినీటి సౌకర్యం, ఊరేగింపు మార్గాల వద్ద చెట్ల కొమ్మలు తొలగింపు ,మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం, రోడ్లపై గుంతలు పూడ్చడం , హంగ్ అవుట్ కేబుల్ తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు, డిప్యూటీ డైరెక్టర్లు, అదనపు వైద్యాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంబీర్ చెరువు పరిశీలన



అంబీర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు వద్ద వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన బీబీ పాండ్‌ను గురువారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్వరరావు, జీహెచ్‌యంసి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకొక్క పాయింట్ వద్ద రెండు పెద్ద క్రేన్లు, ఒక చిన్న క్రేన్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాండ్‌లో తగినంత నీరు ఉండేలా చూడాలన్నారు. గజ ఈతగాళ్లను మూడు షిఫ్టులలో నియమించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు నిరంజన్‌గౌడ్, సురేష్, వాసు, హనుమంతరావు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శేరిలింగంపల్లి: భెల్ టౌన్‌షిప్‌లోని శేరిలింగంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. కనీస విద్యార్హత 55 శాతం మార్కులతో పీజీ ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం, నెట్, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులు లేని ఎడల మాత్రమే పీజీ అభ్యర్థులకు అవకాశం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల లోపు ఆఫీసులో దరఖాస్తులను అందజేయాలని, ఇంటర్వ్యూ జరిగే తేదీలను తర్వాత ప్రకటిస్తామని వెల్లడించారు. ఇంగ్లీష్-2, తెలుగు-1, హిందీ-1, హిస్టరీ-1, కామర్స్-2, మ్యాథ్స్-1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్-1 అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పటాన్‌చెరు టౌన్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను బీబీఏ-1 , బాటనీ-1 కామర్స్-5 ,కంప్యూటర్ సైన్స్- 1, హిస్టరీ-1, తెలుగు-1, జువాలజీ-1 ,అతిథి అధ్యాపకుల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్హత కలిగి ఉండి 55 శాతం మార్కులు (ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం) మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి డిగ్రీ కళాశాలలో సర్వీస్‌కు ప్రాధాన్యత ఉంటుందన్నారు. పై సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకునే వారు అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సెప్టెంబర్ 9 సాయంత్రం 3 గంటల లోపల డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరు కార్యాలయంలో అందజేయాలి. సెప్టెంబరు 10 తేదీ ఉదయం 10.30 నుండి తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) సంగారెడ్డిలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి కళాశాల కార్యదర్శి సుధీర్, ప్రిన్సిపల్ డాక్టర్ టి రవి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు, కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ టి రవి, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చందానగర్‌లో..

చందానగర్: చందానగర్‌లోని మహిళా దక్షత సమితి విద్యా సంస్థలకు చెందిన సుమన్ జూనియర్, ఒకేషనల్ కళాశాల, బజాజ్ డిగ్రీ కళాశాల, బన్సీలాల్ మలానీ నర్సింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించుకున్నారు. విద్యారంగంలో రాధాకృష్ణన్ చేసిన కృషి మరువలేనివన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సీఆర్ ఫౌండేషన్‌లో

చందానగర్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.



చందానగర్‌లోని సుమన్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



గోపన్‌పల్లిలోని సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాలలో ..

'ఎస్కీ'లో..

రాయదుర్గం: ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు అభివర్ణించారు. గచ్చిబౌలి లోని 'ఎస్కీ' సెమినార్ హాల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.



కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో..



ఎస్కీలో..డైరెక్టర్ డా.రామేశ్వరరావు, ప్రిన్సిపల్ జగన్‌మోహన్‌రెడ్డి, అధ్యాపకులు